సాక్షి గుంటూరు

సోమవారం । 1 । జనవరి । 2024



ఎస్టీయూ క్యాలెండ్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్:ఎస్టీయూ క్యాలెండర్, డైరీని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆదివారం రింగ్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు.



సాగర్‌లో పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునసాగర్, విజయపురిసౌత్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు భారీగా తరలివచ్చారు.



తిరుపతమ్మకు బంగారు గాజులు

పెనుగంచిప్రోలు:తిరుపతమ్మవారికి ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన దంపతులు 12 గ్రాముల బంగారు గాజులను బహూకరించారు.

న్యూస్‌రీల్

పన్ను వసూళ్లలో గుంటూరుకు తొలిస్థానం

నెహ్రూ నగర్(గుంటూరు ఈస్ట్): 2023–24 రెండో అర్ధ సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థల పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే గుంటూరు నగర పాలక సంస్థ మొదటి స్థానంలో నిలిచిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం తెలిపారు. వడ్డీ లేకుండా పన్ను చెల్లించేందుకు డిసెంబర్ 31వ తేదీ వరకు గడువు ఉండటంతో నగర ప్రజలు ఆదివారం ఒక్కరోజే రూ.1,26,06,701 చెల్లించారని చెప్పారు. రాష్ట్రంలో రెండో స్థానంలో రూ.67 లక్షలతో విజయవాడ నిలిచిందని పేర్కొన్నారు.

ఆంజనేయుని సన్నిధిలో హైకోర్టు జస్టిస్ జ్యోతిర్మయి



తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు సందర్శించారు. దేవస్థానానికి విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వీరితోపాటు తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రాజశేఖర్ ఉన్నారు. తొలుత ఆలయం చుట్టూ న్యాయమూర్తి దంపతులు ప్రదక్షిణలు చేశారు. మొక్కుబడులు సమర్పించుకున్నారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందచేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి స్వామివారి జ్ఞాపికను వారికి అందజేశారు. శాలువాలతో సత్కరించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సభ్యులు న్యాయమూర్తి దంపతులను సత్కరించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆర్.కిరణ్‌కుమార్, సురేష్, వైఖానస పండితులు ఎస్‌జీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వేడివిజన్ గుంటూరు–నంద్యాల స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను దారి మళ్లించినట్టు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. రైలు నంబర్ 17215 మచిలీపట్నం–ధర్మవరం రైలు జనవరి 2 నుంచి 4 వరకు కృష్ణాకెనాల్, తెనాలి, రేణిగుంట, పాకాల, మదనపల్లి మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. రైలు నంబర్ 17216 ధర్మవరం–మచిలీపట్నం రైలు జనవరి 3 నుంచి 5 వరకు మదనపల్లి, పాకాల, రేణిగుంట, తెనాలి, కృష్ణాకెనాల్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ప్రయాణికులు అసౌకర్యాన్ని గమనించాల్సిందిగాసూచించారు.

దీక్ష విరమణ ఏర్పాట్ల పరిశీలన



విజయవాడ : దీక్ష విరమణలకు వచ్చే భవానీలకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు సిబ్బందికి సూచించారు. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే భవానీ దీక్ష విరమణలు పురస్కరించుకుని దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం చైర్మన్, ఈవో పరిశీలించారు. మహా మండపం ఎదుట హోమగుండాలు, ఇరుముడులు సమర్పించే కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, తలనీలాలు సమర్పించే కేశఖండనశాలలో ఏర్పాట్లను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. భవానీల రద్దీ అధికంగా ఉండే వీఎంసీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేస్తున్న హోల్డింగ్ పాయింట్లను పరిశీలించడంతో పాటు భవానీలకు తాగునీరు, ఇతర వసతులపై ఆరా తీశారు. అనంతరం సీతమ్మ వారి పాదాలు,ఇతర స్నాన ఘాట్లను పరిశీలించి షవర్లను తనిఖీ చేశారు. పర్యటనలో దేవస్థాన ఈఈ ఎల్.రమాదేవి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 522.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 830.30 అడుగుల వద్ద ఉంది.

● 'జన'వరి జోష్



గుంటూరు నగరంలోని ఓ హాస్టల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థినుల కేరింతలు

విరిసిన ఆశలే తోరణాలుగా.. పెదవులపై నర్తించిన నవ్వులే కోటి ఉషస్సులుగా.. ముంగిళ్లలో మెరిసిన రంగవల్లులే హరివిల్లులుగా.. మదిలో వికసించిన సంతోషాల సుమాలే కాంతిరేఖలుగా.. లోకమంతా సంబరమై మురిసింది. నవోదయానికి వెలుగుపూల బాటై సుస్వాగతం పలికింది. కొత్త వత్సరానికి ఆహ్వానమంటూ నినదించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలు అంబరాన్నంటాయి. కేక్ కటింగ్స్‌తో ఆబాలగోపాలం కేరింతలు కొట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు





గుంటూరు నార్త్ ప్యారిస్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రీస్తు భక్తులు

నవ్వులు కురిపించెన్

కొత్త సంవత్సరం.. కొత్త కానుక

- జనవరి నుంచి పింఛన్ రూ.3,000
- పెరగనున్న వైఎస్సార్ పెన్షన్ కానుక
- హామీ నిలబెట్టుకుంటున్న సీఎం వై.ఎస్.జగన్
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- గుంటూరు జిల్లాలో కొత్తగా 3,773 మందికి పెన్షన్
- నేడు పొన్నూరులో కలెక్టర్ చేతుల మీదుగా కొత్త పెన్షన్లు అందజేత



పెన్షన్ అందుకుంటున్న దివ్యాంగుడు (ఫైల్)

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): కొత్త సంవత్సరం.. కొత్త పెన్షన్‌తో పేదల మోముల్లో చిరునవ్వులు విరాజిల్లనున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం జనవరి నుంచి పెన్షన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచారు. 8వ తేదీ వరకు జరిగే పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా లబ్ధిదారులకు వలంటీర్లు నగదు అందించేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. సోమవారం పొన్నూరులో కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కొత్త పెన్షన్లు అందజేయనున్నారు. గుంటూరు జిల్లాలో కొత్తగా 3,773 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. డిసెంబర్ 27వ తేదీ వరకు వెరిఫికేషన్ పూర్తయి, ఈకేవైసీ పూర్తి చేసుకున్న 3,773 మందికి నగదు మంజూరైంది. 27 తరువాత వెరిఫికేషన్ పూర్తయిన వారికి ఈనెల 8వ తేదీలోగా పింఛన్ రానుంది.

2,62,627 మందికి పెన్షన్లు

జిల్లాలో ప్రస్తుతం 2,58,854 మందికి ప్రభుత్వం రూ.76.41 కోట్ల మేర పింఛన్లు అందిస్తోంది. ఇప్పుడు కొత్త పింఛన్లు 3,773తో కలుపుకుని 2,62,627 మందికి రూ.77.54 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 8 రకాల పింఛన్ లబ్ధిదారులకు రూ.2,750 నుంచి రూ.3 వేలకు మొత్తం పెరిగింది.

పెన్షన్ వారోత్సవాలు ఇలా..

1న పొన్నూరు, పొన్నూరు మున్సిపాలిటీ, 2న పెదనందిపాడు, 3న దుగ్గిరాల, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, పెదకాకాని, 4న చేబ్రోలు, కాకుమాను, మంగళగిరి, మంగళగిరి మున్సిపాలిటీ, ఫిరంగిపురం, తాడేపల్లి, తాడేపల్లి మున్సిపాలిటీ, తెనాలి, తెనాలి మున్సిపాలిటీ, 5న గుంటూరు, కొల్లిపర, ప్రత్తిపాడు, తాడికొండ, 6న మేడికొండూరు, తుళ్లూరు, వట్టిచెరుకూరు మండలాల్లో పెన్షన్ వారోత్సవాలు జరగనున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా కొత్త పెన్షన్ లబ్ధిదారులకు నగదు అందించనున్నారు.

అర్హులందరికీ కొత్త పింఛన్లు

గుంటూరు జిల్లాలో డిసెంబర్ 27వ తేదీలోగా వెరిఫికేషన్, ఈకేవైసీ పూర్తయిన 3,773 మందికి కొత్త పెన్షన్లు మంజూరయ్యాయి. 27 నుంచి డిసెంబర్ 31 వరకు వచ్చిన అర్జీలను ఈనెల 5వ తేదీలోగా వెరిఫై చేసి 8వ తేదీ వరకు జరగనున్న పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా కొత్తగా పెన్షన్ మంజూరైన వారికి రూ.3 వేలు చొప్పున అందించనున్నాం.

– వై.హరిహరనాథ్, డీఆర్‌డీఏ పీడీ

ఎంతో ఆనందంగా ఉంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రూ.3 వేలకు పింఛన్ మొత్తం పెంచడం ఎంతో ఆనందంగా ఉంది. ఎవరి మీదా ఆధారపడకుండా వచ్చిన డబ్బు నా ఖర్చులకు ఉపయోగపడుతోంది.

– బోరుగడ్డ గ్రేసమ్మ, క్రిస్టియన్ పేట, గుంటూరు, వితంతువు

నేడు తెనాలికి అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్



అమృత్ భారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్



రైలు లోపలి సౌకర్యాలు

తెనాలి: సాధారణ ప్రయాణికుల కోసం తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే సూపర్ ఫాస్ట్ రైళ్లను తీసుకురావాలన్న తలంపుతో భారత రైల్వేశాఖ కొత్తగా రెండు అమృత్‌భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. వీటిని భారత ప్రధాని నరేంద్రమోదీ శనివారం ప్రారంభించారు. ఈ రెండింటిలో ఒకటైన పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా నుంచి ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినస్ (బెంగళూరు) మధ్య నడిచే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఆంధ్రప్రదేశ్ నుంచి వెళుతుంది. మాల్దా నుంచి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ నూతన సంవత్సరం తొలిరోజైన సోమవారం ఉదయం 6.30 గంటలకు తెనాలి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. రైలుకు ఘనస్వాగతం పలికేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. భారత రైల్వేశాఖ కొత్తగా ప్రవేశపెట్టిన హైస్పీడ్ రైళ్లలో మొదటిది వందేభారత్ ఎక్స్‌ప్రెస్. ప్రయాణికుల ఆదరణలో శరవేగంగా దూసుకుపోతోంది. ఖరీదైన సౌకర్యాలతో కూడిన ఈ రైలు ప్రయాణం వ్యయభరితమని తెలిసిందే. విజయవాడ–చెన్నై మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు తెనాలి జంక్షన్‌లో స్టాపింగ్ కల్పించిన విషయం తెలిసిందే. జనవరి 24న ఇక్కడ వందేభారత్‌కు రైల్వే అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రయాణికులు ఘన స్వాగతం పలికారు. మళ్లీ ఇప్పుడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలకనున్నారు. ఉపాధి అవకాశాల కోసం దూరప్రాంతాలకు వెళ్లే పేద, దిగువ మధ్యతరగతి వర్గాలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించటం అమృత్ భారత్ రైళ్ల లక్ష్యం. పుల్ పుష్‌బ్యాక్ టెక్నాలజీతో తయారుచేసిన ఈ రైలు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఆరెంజ్, గ్రే కలర్ స్కీముతో ఆకర్షించే డిజైనుతో చేశారు. మొత్తం 22 కోచ్‌లుంటాయి. రిజర్వు చేయని ప్రయాణికుల కోసం 8 సాధారణ 2వ తరగతి కోచ్‌లు, 12 సెకండ్ క్లాస్, 3–టైర్ స్లీపర్ కోచ్‌లు, రెండు గార్డు కంపార్టుమెంట్లు ఉన్నాయి. అన్ని కోచ్‌ల్లో ఆకర్షణీయమైన సీట్ లేఅవుట్‌లు, మెరుగైన లగేజి ర్యాక్‌లు, సీసీటీవీలు, ప్రతి బెర్త్ వద్ద మొబైల్ చార్జింగ్ పాయింట్లు, ఎల్ఈడీ లైట్లు, సమగ్ర ప్రజాసమాచార వ్యవస్థ వంటి మెరుగైన సౌకర్యాలను ఇందులో కల్పించారు. మన రాష్ట్రంలో విజయవాడ తర్వాత తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టాపింగ్‌లు ఉన్నాయి. రెగ్యులర్‌గా ఈనెల 7 నుంచి ఈ రైలు ప్రయాణిస్తుంది. రైలు నంబర్ 13434 మాల్దా–బెంగళూరు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ ఆరోజు ఉదయం 8.50 గంటలకు మాల్దా నుంచి బయలుదేరుతుంది. మరుసటిరోజైన సోమవారం మధ్యాహ్నం 11.58 గంటలకు తెనాలి చేరుకుంటుంది. రైలు నంబర్ 13433 బెంగళూరు–మాల్దా రైలు ఈనెల 9న మధ్యాహ్నం 1.50కు బెంగళూరులో బయలుదేరి, 10వ తేదీ తెల్లవారుజామున 1.04 గంటలకు తెనాలి వస్తుంది.

జీజీహెచ్‌లో 25 పడకలతో ఐసీయూ

- ఆధునిక వైద్య సౌకర్యాలతో ప్రారంభానికి సిద్ధం
- రూ. 3 కోట్లతో ఇంటెన్సివ్ కేర్ నిర్మాణం



ప్రారంభానికి సిద్ధమైన ఐసీయూ

గుంటూరు మెడికల్: పేద రోగులకు శుభవార్త. గుంటూరు జీజీహెచ్‌లో నూతన ఏడాది 2024లో మరో అత్యాధునిక వైద్య విభాగం అందుబాటులోకి రానుంది. ప్రాణాపాయ స్థితిలో చికిత్స అందించి రోగుల ప్రాణాలు కాపాడే ఐసీయూ, వెంటిలేటర్ వైద్యసేవలు పూర్తి ఉచితంగా అందనున్నాయి. రూ.3 కోట్లతో సకల సౌకర్యాలతో 25 పడకలతో నిర్మించిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ) ప్రారంభానికి సిద్ధమైంది. జనవరి మొదటి వారంలో ఈ ఐసీయూను ప్రారంభించేందుకు ఆస్పత్రి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

జీజీహెచ్‌పై ప్రత్యేక శ్రద్ధ

గుంటూరు జీజీహెచ్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధపెట్టి కోట్లాది రూపాయల వైద్య పరికరాలు ఆస్పత్రికి మంజూరు చేశారు. రాష్ట్రంలో ఏ ఆస్పత్రికి లేని విధంగా ఈ ఏడాదిలో రూ.25 కోట్లు ఖరీదు చేసే పెట్ సీటీస్కాన్ వైద్య పరికరం, రూ.4 కోట్లు ఖరీదు చేసే సీటీ స్కాన్ వైద్య పరికరం, ఇతర వైద్య పరికరాలు మంజూరు చేశారు. సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం రూ.7.5 కోట్లు, కాకుమానువారితోట హాస్పిటల్ ప్రహరీ నిర్మాణం కోసం రూ.3.5 కోట్లు సీఎం మంజూరు చేశారు. ఆస్పత్రి మరమ్మతుల కోసం ఇటీవల కేటాయించిన నిధులతో జీజీహెచ్ క్యాజువాలిటీలో కోవిడ్ కాలంలో రోగులను ఉంచిన ప్రదేశంలో ప్రస్తుతం ట్రాన్సిట్ అడ్వాన్స్‌డ్ ఐసీయూను నిర్మాణం చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



చండీహోమంలో పాల్గొన్న ఉభయదాతలు

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో ఉభయదాతలు పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉత్సవమూర్తి వద్ద నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. లోక సంరక్షణార్థం సర్వ మానవాళి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆయా ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మరో వైపున భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో కెఎస్.రామారావు క్యూలైన్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు పాల్గొన్నారు.

విజయవాడ : శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు రూ.50 వేల విలువ చేసే కంప్యూటర్‌ను ఆదివారం విరాళంగా అందజేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన ఎం.అశిత, ఇందుమతిలు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈవో కెఎస్.రామారావును కలిసిన భక్తులు రూ. 50 వేల విలువ చేసే కంప్యూటర్, ఇతర మెటీరియల్స్‌ను అందించారు.

క్లుప్తంగా

మంత్రి రజిని నూతన సంవత్సర శుభాకాంక్షలు



పట్నంబజారు: నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రజలందరికీ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రతి ఇంట సంక్షేమ కాంతులు విరబూయాలని, ఆనందోత్సాహాలతో ప్రతి కుటుంబం సంతోషాల నడుమ జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రతి మంచి పనికి ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. నూతన సంతవ్సరం రోజున కొరిటెపాడులోని ప్రధాన రహదారిలో నూతన పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

జెడ్పీ చైర్‌పర్సన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులతో పాటు అధికార యంత్రాగానికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సురేష్‌కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో నూతన ఆనందాలు, సంతోషాలను తీసుకురావాలని కోరుకుంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్నివర్గాల ప్రజలందరు సుఖిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇంటి ముంగిటకే విస్తృతమైన సంక్షేమ పథకాలను తెచ్చిన జగనన్న ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపిందని అన్నారు.

దోపిడీ ఘటనల్లో ముగ్గురు నిందితులు అరెస్ట్



గుంటూరు ఈస్ట్: రెండు వేర్వేరు దోపిడీ ఘటనల్లో ముగ్గురు నిందితులను అరండల్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ భాగ్యరాజు మీడియాకు వివరించారు. శ్రీనగర్ 8వ లైన్‌లో నివసించే శ్రీదేవి దేవి శారీస్ రెడీమెడ్ డ్రస్సెస్ పేరుతో ఇంటి ముందు షాపు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఈ నెల 8వ తేదీ ఇద్దరు యువకులు షాపునకు వచ్చి దుస్తులు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించారు. శ్రీదేవి చిల్లర ఇవ్వడం కోసం ఇంట్లోకి వెళ్లగా ఇద్దరు యువకులు లోపలికి వెళ్లి ఆమెను కొట్టి బెదిరించి ఆమె నుంచి రూ.1,20,000 లాక్కొని పరరాయ్యరు.

- మరో ఘటనలో శ్రీనగర్ ఏడో లైన్‌లో ఉంటున్న విశ్రాంత ఉద్యోగిని ఆనందబాల ఇంటి పోర్షన్ ఖాళీ అవడంతో టూలెట్ బోర్డు తగిలించింది. ఈ నెల 22వ తేదీ ఇద్దరు యువకులు, ఒక మహిళ ఇంట్లోకి వచ్చి అద్దె ఇల్లు చూపించాలని ఆనంద బాలను కోరారు. ఆనంద బాల వారికి ఇల్లు చూపిస్తున్న క్రమంలో ముగ్గురు ఆమెపై దాడి చేశారు. ఈక్రమంలో బాధితురాలి మెడలోని రెండు బంగారు గొలుసులు, రెండు బంగారు గాజులు, మూడు ఉంగరాలు, ఒక సెల్ ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పరరాయ్యరు. ఈ ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితులైన పిడుగురాళ్లకు చెందిన కుంచపు దుర్గాప్రసాద్, గుంటూరు రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన బత్తుల అశోక్‌కుమార్, మున్నంగి ప్రియాంకలను ఆదివారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.10వేల నగదు, బంగారు ఆభరణాలు మొత్తం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భాగ్యరాజు చెప్పారు.

సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకం

- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు
- రానున్న ఎన్నికల్లో న్యాయవాదులు కీలకంగా వ్యవహరించాలి : మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా కమిటీ ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, వేదికపై మంత్రి రజిని, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా తదితరులు

పట్నంబజారు: నా జీవితాన్ని న్యాయవాదిగానే ప్రారంభించానని చెప్పుకునేందుకు తాను గర్వపడతానని.. ఆ రోజుల్లో లీగల్ విభాగం అధ్యక్షుడిగా పనిచేసిన తరువాతనే.. ఇంతటి రాజకీయ నేతను అయ్యానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని మెడికల్ కళాశాల రోడ్డులో ఉన్న ఎన్జీఓ కల్యాణ మండపంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం నేతృత్వంలో న్యాయవాదుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్ అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం నాటి నుంచి న్యాయవాదులది సమాజంలో ఎంతో కీలక పాత్ర అని, సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన సత్తా వారికి ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆనాడు ఓదార్పుయాత్ర చేపడితే.. అది మంచి నిర్ణయమేనని ముందుగా న్యాయవాదులే హైదరాబాదులో గళమెత్తారన్నారు. వైఎస్సార్ సీపీలో ఓర్పుగా ఉన్న ప్రతి ఒక్కరికీ ఖచ్చితంగా మేలు జరుగుతుందన్నారు. విశ్వాసంగా ఉండండి న్యాయం జరగకపోతే నన్ను అడగండి అని చెప్పే ఏకైక నేత సీఎం జగన్ అని స్పష్టం చేశారు. ఐదేళ్ల సీఎం వైఎస్ జగన్, చంద్రబాబునాయుడు పాలననూ బేరీజు వేయాల్సిన అవసరం ఉందన్నారు. రూ.2లక్షల 40వేల కోట్లు నేరుగా ప్రజలకు అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకునే.. కుప్పంలో ఎయిర్‌పోర్ట్ కట్టి.. విదేశాలకు కూరగాయలు ఎగుమతి చేస్తామని చెబుతున్నారని, ఇల్లు కట్టుకుంటున్నారని, మరీ ఇన్నేళ్లు గాడిదలు కాశారా అని ప్రశ్నించారు. కుప్పంను కనీసం రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీ కూడా చేయని చంద్రబాబు ఎయిర్‌పోర్ట్ ఎలా కడతారని వ్యంగ్యస్త్రాలు సంధించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలు కలిసి సీఎం జగన్‌ను గద్దె దింపాలని కుట్రలు చేస్తుంటే.. ప్రజలు మాత్రం జగన్‌నే గద్దెనెక్కిస్తామని చెబుతున్నారన్నారు.

- శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రారంభం నుంచి న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సీఎం జగన్ తీసుకున్న అనేక నిర్ణయాల్లో ఆయన అడుగులో అడుగులు వేస్తూ.. పార్టీ జెండాను భుజాన మోశారన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ప్రతి ఒక్కరూ గెలిచేలా న్యాయవాదులు పాటుపడాలని కోరారు.
- నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి న్యాయవాదులు పార్టీ పటిష్టతకు ఎంతగానో పాటుపడ్డారన్నారు. టీడీపీ నేతలు పెట్టిన అక్రమ కేసులకు సంబంధించి ఒక్క రూపాయి కూడా ఫీజు తీసుకోకుండా వారి కోసం పోరాడారన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడి న్యాయవాదులు చేసిన పోరాటాలు వర్ణనాతీతమన్నారు.
- తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ అన్నివర్గాలతో సన్నిహితంగా మెలిగేది కేవలం న్యాయవాదులు మాత్రమేనన్నారు. అటువంటి న్యాయవాదులు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు.
- లీగల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక టీడీపీ నేతలు పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌లు వేస్తూనే ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని, అనేక విధాల పిటిషన్లు వేస్తూంటే.. లీగల్ విభాగం ఎంతో సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. జనవరి 15వ తేదీలోగా రాష్ట్రంలో అన్ని జిల్లా లీగల్ విభాగం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఫిబ్రవరి నెలలో ఎలక్షన్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో న్యాయవాదులకు అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
- పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో న్యాయవాదుల వృత్తి ఎంతో కీలకమని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు న్యాయవాదులు అని అన్నారు. పార్టీ లీగల్ విభాగం కోర్ కమిటీ సభ్యుడు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి మాట్లాడారు. ముందుగా ముఖ్యఅతిథులను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం నేతలు, న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, మాధవి, బూదాటి సాగర్, మొండితోక శ్రీను, పల్లపు కృష్ణ, శ్రీనివాసులరెడ్డి, గవాస్కర్, సాయిరామ్,రవి, పక్కాల సూరిబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి : మంత్రి విడదల రజిని

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి సీఎం జగన్ ఎంతగానో పాటుపడుతున్నారన్నారు. రూ.100 కోట్లు సంక్షేమ నిధికి ఇవ్వటంతో పాటు, జూనియర్ న్యాయవాదులు రూ.5వేలు చొప్పున స్టైఫండ్ ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యత కల్పించే దిశగా అనేక మందికి పీపీలు, ఏపీపీలు ఇవ్వటం జరిగిందన్నారు. సీఎం జగనన్న న్యాయవాదులకు అన్నివిధాలుగా అండగా ఉంటారన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు

మహిళ సహా తొమ్మిది మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

తెనాలిరూరల్: భర్త హత్యకు దారి తీసిన దంపతుల గొడవ ఘటనపై కేసు నమోదవగా, తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొత్తపేటలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ బి.జనార్ధనరావు వివరాలు తెలిపారు. కఠెవరం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన మృతుడు గేరా వాసు పెయింట్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గ్రామానికి చెందిన బత్తుల అబ్రహాం కూతురు వెన్నలను నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వాసు తల్లి అనారోగ్యానికి గురవడంతో ఆమెకు సంబంధించిన పనులన్నీ వెన్నెలే చేస్తోంది. ఈ క్రమంలో 25వ తేదీన వెన్నల తండ్రి అబ్రహాం, బాబాయి కలిసి ఆమె ఇంటికి వచ్చి, అక్కడ కూతురు వెట్టి చాకిరీ చేస్తుందని చూసి అల్లుడు వాసుని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. అక్కడి నుంచి వెళ్లిపోయిన వారు తమ కూతురు పడుతున్న బాధల గురించి గ్రామంలోనే ఉంటున్న తన అక్క తోకల మేరీకి అబ్రహాం, అతని తమ్ముడు చెప్పుకుని బాధపడ్డారు. అనంతరం మేరీ తన భర్త, ఇద్దరు కొడుకులను తీసుకుని వాసు ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగి అంతా కలిసి వాసుపై దాడి చేశారు. వాసుతో పాటు అతడి తమ్ముడు గోపి, మేనమామ తిరుపతిరావులపై కూడా దాడికి దిగారు. ఇదే సమయంలో పాత కక్షలు మనసులో పెట్టుకున్న వెన్నెల బావ అయిన తోకల అరవింద్ తన స్నేహితులు మాతంగి ప్రకాష్, గోళ్ల జయంత్, కంచర్ల ప్రవీణ్, కోట రవికుమార్‌లతో కలిసి అక్కడకు చేరుకుని వాసుపై విచక్షణారహితంగా దాడి చేశారు. కత్తులు, గొడ్డలి, స్క్రూ డ్రైవర్‌తో వాసుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడగా బంధువులు ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళుతుండగానే అతడు మృతి చెందాడు. దీనిపై వాసు మేనమామ తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేయగా సీఐ కె.శ్రీనివాసరెడ్డి దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితులుగా ఉన్న మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వీరివద్ద రెండు మోటార్ బైక్‌లు, రెండు కత్తులు, గొడ్డలి, స్క్రూ డ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్, సిబ్బంది ఉన్నారు.

ఆకట్టుకున్న సాంఘిక పద్యనాటకం

తెనాలి: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాటక రచయిత ఎం.అంబదాస్ రచించి, దర్శకత్వం వహించిన 'అమృతము వద్దు...ఆ మృతమూ వద్దు...అనే నాటకాన్ని కళల కాణాచి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నాటక రచయితలతో పట్టణంలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శనివారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంఘిక పద్యనాటకం ఆకట్టుకుంది. దాదాపు రెండున్నర గంటల వ్యవధి కలిగిన ఈ నాటకంలో 52 పద్యాలు, ముచ్చటగా మూడు పాటలు కథానుగుణంగా సాగాయి. మొత్తం 19 మంది నటీనటులు ఇందులో పాత్రోచితంగా నటించారు. ఈ సందర్భంగా ఒక్కో నాటక రచయితకు రూ.25 వేల పారితోషికం ఇస్తామని కళల కాణాచి వ్యవస్థాపకుడు, ప్రముఖ సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ప్రకటించారు. దీనికి ముందు శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సమాజం 'కౌసల్యా సుప్రజా రామా' నాటికను ప్రదర్శించారు. ఆకెళ్ల శివప్రసాద్ మూల కథను శ్రీస్నిగ్ధ నాటకీకరరించారు. గోపరాజు విజయ్ దర్శకత్వంలో ఈ నాటికను ప్రదర్శించారు. తొలుత నాటక ప్రదర్శనలకు ముందు ప్రముఖ రంగస్థల కళాకారిణి బుర్రా జయలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేశా రు. డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, సీహెచ్ సింగారావు, కె.రమేష్, డి.భవాని పర్యవేక్షించారు.

రైతుభరోసా కేంద్రాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

శావల్యాపురం: జిల్లాలో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రం శావల్యాపురంలో తహసీల్దారు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని విలేకరుల సమావేశం నిర్వహించారు. కంది పంట సాగు చేసిన రైతుల నుంచి క్వింటాకు మద్దతు ధర రూ.7500లు చొప్పున నేరుగా కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారుల ద్వారా మోసపోకుండా ఉండేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గోనె సంచులు, కూలీల ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కందులు అమ్మిన వారం రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు ప్రభుత్వమే జమ చేస్తుందన్నారు. అసైన్డ్ భూములు 20 సంవత్సరాల పాటు తమ ఆధీనంలో ఉన్నట్లు అగ్రిమెంటు ఆధారాలు ఉన్నటు వంటి రైతులకు భూమి హక్కు కల్పించేలా ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. దీని ద్వారా అమరావతి, అచ్చంపేట తదితర ప్రాంతాల్లోని రైతులకు లబ్ధి చేకూరిందన్నారు.

[redacted]

IV

సాక్షి ఫ్యామిలీ

గుంటూరు

సోమవారం ॥ 1-1-2024

సాధారణంగా కొత్త సంవత్సరం వస్తోంది అంటే ఎన్నో సంబరాలు. సంవత్సరంతో పాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ళని, వీధులని, నగరాలని అలంకరిస్తారు. అలంకారాలు, దీపాలు, టపాకాయలు, కొత్తబట్టలు, మిఠాయిలు (ఎక్కువగా కేకు) పంచుకోవటాలు, విందులు, వినోదాలు, శుభాకాంక్షలు. అంటే రాబోయే కాలం ఆనంద దాయకంగా ఉండాలనే ఆకాంక్ష, ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటమే వీటిలోని అసలు అర్థం.

కొత్త సంవత్సరం

మంచి మాట

కొత్త ఆశలు, ఆశయాలు



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి లెక్కించటం కూడా ప్రారంభించాడు. ప్రకృతిలో వస్తున్న మార్పులని పరిశీలించి, తదనుగుణంగా ఉండటం కోసం కాలాన్ని కూడా గణించటం ప్రారంభించాడు. కాలగణనకి ప్రమాణం ప్రకృతిలో జరిగే పరిణామాలే. కొద్దికాలం జరిగిన తరవాత మళ్ళీ ఇంతకు ముందు ఉన్నట్టే ప్రకృతి కనపడితే ఈ క్రమం ఏమిటి? అన్నది అర్థం చేసుకునే ప్రయత్నంలోనే మనిషి కాలాన్ని లెక్కపెట్టటం జరిగింది. లెక్కపెట్టటం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు మొదలుపెట్టాలి. ఒక్కొక్క ప్రాంతం వారు వారికి అనుకూలంగా ఉన్న సమయం నుండి లెక్కపెట్టటం మొదలుపెట్టారు. కాలక్రమంలో దానిలో ఒక హేతుబద్ధతని అవలంబించారు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండే సమయాన్ని కాలాన్ని లెక్కకట్టటానికి మొదలుగా తీసుకున్నారు. పాశ్చాత్యులకి ఆహ్లాదకరంగా ఉండే వసంతం (స్ప్రింగ్) మార్చ్, ఏప్రిల్ నెలలు. మార్చ్ 23 ని సంవత్సర మానానికి ఆదిగా పరిగణించే వారు. తరువాత నెల మధ్యలో ఎందుకని ఏప్రిల్ 1 ని సంవత్సరాదిగా జరుపుకునే వారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జనవరి 1 కి మారింది. మార్చ్ మొదటి నెల కనుక డిసెంబర్ 10 వ నెల, నవంబర్ 9 వ నెల, అక్టోబర్ 8 వ నెల, సెప్టెంబర్ 7 వ నెల అయ్యాయి. ఆ పేర్లే నెలల సంఖ్యని తెలియ చేస్తున్నాయి. ఈ కాలెండర్ ని గ్రెగేరియస్ కాలెండర్ అంటారు. అందరికీ తమ కాలెండర్ ఉన్నా, ఇప్పుడు ప్రపంచం అంతా ఈ కాలెండర్‌నే అనుసరిస్తోంది.

ఈ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తారీకుతో కొత్త సంవత్సరం మొదలు అవుతుంది. సౌర మానాన్ని అనుసరించి ఒక సంవత్సరంలో 365 1/3 రోజులు ఉంటాయి. అందుకని నాలుగు సంవత్సరాలకి ఒక మారు లీప్ ఇయర్ అని ఒక రోజు అధికంగా వస్తుంది. ఆ రోజు తక్కువ రోజులు ఉండే ఫిబ్రవరికి వెడుతుంది.

అయితే ఆనందోత్సాహాలు ఎందుకు? ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు. ఆ విధంగా గడిపే అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు. సంవత్సరంలో మొదటి రోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం.

రెండువేల ఇరవై నాలుగవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని ఆనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాము.

> అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్యసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టటానికి నిర్ణయించుకో వలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్తపని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

● ముగ్గు ముచ్చట



ముగ్గులకు ఆహ్వానం



26 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



గుంటి శైలజ
మూసాపేట
హైదరాబాద్

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

మనం అందరం కారణజన్ములం. ఏదో ఒక ప్రత్యేకమైన గొప్ప పని చేసేందుకు ఈ భూమిపై జన్మించాం. ఇంత గొప్ప అవకాశం వృథా చేసుకోకండి. ఈ సంవత్సరం ఏదైనా కొత్త, సృజనాత్మకమైన పని మొదలుపెట్టండి. ఏదైనా కొత్త పని చేయకుండా ఏ సంవత్సరమూ గడచిపోకూడదు. మీకు ఏ కలలూ లేకపోతే, వాటిని నిజం చేసుకోలేరు కదా! ఏ కొత్త ఆవిష్కరణ అయినా ఒక కలతో మొదలవుతుంది. ఉన్నతంగా కలలుగనే, ఆలోచించే స్వేచ్ఛని మీకు మీరు ఇచ్చుకోండి. ఆపై, వాటిని సాధించేందుకు నూరుశాతం ధైర్యంతో, సమర్పణభావంతో పనిచేయండి.

ఒక అసాధ్యాన్ని సాధిస్తా!

ఈ భూమిని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా

చాలాసార్లు ఉన్నతమైన కలలు కనేవారిని ఇతరులు అపహాస్యం చేశారు. కానీ వారు వెనక్కు తగ్గకుండా, తమ లక్ష్యాలను సాధించేవరకూ స్థిరంగా నిలబడ్డారు.

మనలో ఉండే ప్రాణశక్తి ప్రవహించేందుకు ఒక దిశను చూపటం అవసరం. దానికి సరైన దిశను చూపకపోతే మీరు గందరగోళంలో చిక్కుకుపోతారు. జీవశక్తి ఒక నిర్దిష్ట దిశలో పయనించేలా చేయాలంటే మనకు నిబద్ధత అవసరం. ఈ రోజున చాలామంది, తమ జీవితానికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం, దిశానిర్దేశం లేకపోవడం చేత అయోమయంలో ఉన్నారు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీ ప్రాణశక్తి తారాస్థాయిలో ఉంటుంది, మరి అంత ఎక్కువగా ఉన్న ఆ ప్రాణశక్తికి, ఎటువెళ్లాలో చెప్పకపోతే, అది అక్కడే చిక్కుకుపోతుంది. ఒకేచోట పేరుకుపోతే ఏమౌతుంది? కుళ్ళిపోయి, పనికి రాకుండా పోతుంది.

ఇక్కడ రహస్యం ఏమిటీ అంటే, మన లక్ష్యం పట్ల నిబద్ధత ఎంత గొప్పగా ఉంటే, దాన్ని సాధించేందుకు అంత గొప్ప శక్తి మనకు లభిస్తుంది. లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే, పనులు అంతా సులభంగా, తేలికగా జరిగిపోతాయి. అదే చిన్న లక్ష్యాలు పెట్టుకున్నారనుకోండి, ఎందుకంటే మీలో సామర్థ్యం కొండంత ఉంది, మీరేమో ఈ చిన్న పనిలో ఇరుక్కుపోయారు అనిపించి మీకే చికాకుగా ఉంటుంది.

మీరు సమాజం బాగు కోసం పనిచేస్తున్నప్పుడు, మీరు పది పనులు చేస్తున్నారనుకుందాం. వాటిలో ఒక పనిలో పొరపాటు జరిగినా, మిగతా తొమ్మిది పనులూ చేస్తూ ఉంటే, ఈ మొదటి పనిలో పొరపాట్లు వాటంతట అవే సర్దుకుంటాయి. సాధారణంగా కృప అనేది ఇలా పనిచేస్తుంది. మొదట అవసరమైన వనరులు సమకూరితే, అప్పుడు పెద్ద లక్ష్యం పెట్టుకుని పని చేద్దామని మనం సాధారణంగా అనుకుంటాం. కాని, మొదట మీ లక్ష్యం గొప్పగా ఉంటే, వనరులు వాటంతట అవే సమకూరుతాయి. మనం పెట్టుకున్న లక్ష్యమే మనకు ఆ శక్తిని బహుమతిగా ఇస్తుంది. మీరు మీ కుటుంబ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నారనుకోండి, ఆ కుటుంబమే మీకు సహాయం చేస్తుంది. మీరు సమాజం మొత్తానికి గొప్ప పనిచేయాలని సంకల్పించుకుంటే సమాజం మొత్తం మీకు సహాయపడటాన్ని మీరే చూస్తారు. మీకు కావలసిన సహాయం మీరు అడక్కముందే వచ్చి చేరుతుంది.



గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

> మనస్సు పూర్తిగా వర్తమానంలో ఉన్నప్పుడు, మీకు సరైన ఆలోచనలు వస్తాయి. లక్ష్యాలు పెట్టుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సాధించే విధానం కూడా ప్రణాళిక వేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారు? ఒక ఇరవై ఏళ్ల తర్వాత? నలభై ఏళ్ళ తర్వాత? ఫలితం గురించి ఎక్కువ ఆలోచించకుండా మీ విధిని నూరు శాతం నిర్వర్తించండి.

> మీ నిబద్ధతకు ఆశించిన ఫలితం రావాలంటే సరైన ఆలోచనలు, సరైన చర్యలు రెండూ అవసరమే. మీరు సాధించాలనుకుంటున్న అన్ని విషయాలతో పెద్ద చిట్టా తయారు చేసుకోకండి. స్థూలంగా పరిశీలించి, నిజంగా అవసరమైన కొన్ని లక్ష్యాలను ఎంచుకోండి. మనకు అత్యంత సంతృప్తిని ఇచ్చే వాటిని, దీర్ఘకాలంలో పదిమంది జీవితాలను తీర్చిదిద్దే వాటిని ఎంచుకుని పని చేసినపుడు, మిగిలిన చిన్నాచితక విషయాలు వాటంతట అవే గాడిలో పడతాయి.

సాధారణంగా మనం మనసులో తపన పడుతూ ఉంటాము, కానీ మన చర్యలు నెమ్మదిగా ఉంటాయి. విజయానికి సోపానం ఏమంటే, మనసులో ఓరిమి, పనిలో ఉత్సాహం. అభిరుచిని, వైరాగ్యాన్ని సరిసమానంగా స్వీకరించండి. మీ లక్ష్య సాధనకై ధైర్యంగా ముందుకు సాగండి, అవసరమైనప్పుడు వదిలేయడం కూడా నేర్చుకోవాలి. అపుడు సహజంగా సమృద్ధి చేకూరుతుంది.

మీరు ధ్యానం చేసినపుడు మీరు సూక్ష్మంగా గమనించగలుగుతారు. మీకు పూర్తిగా విశ్రాంతి లభిస్తుంది, అదే సమయంలో బుద్ధి, వివేచన, సద్యఃస్ఫూర్తి వృద్ధి చెందుతాయి. మీరు ఎఱుకతో ఉండి పనిచేస్తే అది సరైన పని అవుతుంది. చెదిరిపోని దృష్టి, సద్యఃస్ఫూర్తితో పనిచేసే మనసు మీ లక్ష్యాన్ని సాధించేందుకు సహాయ పడతాయి. ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన జీవితానికి, మీరు అనుకున్న లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేసేందుకు సరైన మార్గం ధ్యానం.

నిబద్ధత అనేది దీర్ఘకాలంలో ఎప్పుడూ సుఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా జీవించే అద్భుత ప్రదేశంగా మార్చాలని కంకణం కట్టుకోండి. అసాధ్యమైన కల కనండి!

సినిమా



● రజనీకాంత్

కన్యాకుమారిలో వేటగాడు

కన్యాకుమారిలో తిరుగుతున్నాడు వెట్టయాన్ (తెలుగులో 'వేటగాడు' అని అర్థం). రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వెట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా తాజా చిత్రీకరణ కన్యాకుమారి పరిసరాల్లోని లొకేషన్స్‌లో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్, ఫాహద్ ఫాజిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ నటిస్తున్నారని, నకిలీ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. సుభాస్కరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.

గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్



● విజయ్

విజయ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారైంది. విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. న్యూ ఇయర్ (2024) సందర్భంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాకు సంబంధించిన మరో లుక్ నేడు రానుందని కోలీవుడ్ సమాచారం. ఫస్ట్‌లుక్‌ని చూస్తే ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని స్పష్టమవుతోంది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, లైలా, స్నేహ, జయరాం, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదలకానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

మా జోలికొస్తే నా సామిరంగ!



● నరేశ్, నాగార్జున, రాజ్‌తరుణ్

''మా జోలికొస్తే.. మాకడ్డు వస్తే.. మామూలుగా ఉండదు.. నా సామిరంగ..' అంటూ పాడేస్తున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలకానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'నా సామిరంగ..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను కాల భైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'మా జోలికొస్తే మాకడ్డు వస్తే మామూలుగా ఉండదు నా సామిరంగ.., ఈ గీత తొక్కితే మా సేత సిక్కితే మామూలుగా ఉండదు నా సామిరంగ..' అంటూ ఫుల్ జోష్‌లో సాగే ఈ పాటలో నాగార్జునతో కలిసి 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కూడా చిందేశారు. ''మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నా సామిరంగ' రూపొందింది. ప్రధాన తారాగణంతో పాటు 300 మంది డ్యాన్సర్స్‌తో లావిష్‌గా చిత్రీకరించిన 'నా సామిరంగ..' పాటకు దినేష్ మాస్టర్ అందించిన నృత్యాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరధి.

అది మరచిపోలేని జ్ఞాపకం



– శివాత్మిక రాజశేఖర్

''నేను ఎప్పట్నుంచో స్కై డైవింగ్ చేయాలనుకుంటున్నాను. అది 2023లో నెరవేరింది. దుబాయ్‌లో అక్క(శివాని), నేను రెండు వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేశాం. 2023 అనే కాదు.. నా జీవితంలోనే నేను మరచిపోలేని జ్ఞాపకంగా ఈ స్కై డైవింగ్ అడ్వెంచర్‌ను గుర్తు పెట్టుకుంటాను'' అని హీరోయిన్ శివాత్మిక అన్నారు. **2023కి వీడ్కోలు పలుకుతూ 2024కి స్వాగతం పలుకుతున్న శివాత్మిక రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...**

■ **మీ జీవితంలో 2023 ఎలా గడిచింది?**

చెప్పాలంటే... 2023 నాకు గొప్పగా గడిచింది. చాలా విధాలుగా కలిసొచ్చింది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే మంచి ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాననే భావన కలిగింది. ఎప్పట్నుంచో నేను చేయాలనుకుంటున్న పనులు ఈ ఏడాది జరిగాయి. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. నన్ను నేను మెరుగుపరచుకోవడం కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను. కుటుంబం పరంగా కూడా బాగా గడిచింది. దేవుడి దయవల్ల, అదృష్టంగా 2023 నా జీవితంలో సంతోషంగా ముగిసింది.

■ **ఈ ఏడాది మీ జీవితంలో జరిగిన చెడు ఘటనలు ఏవైనా ఉన్నాయా?**

మంచి జరిగినట్లే... ప్రతి ఏడాది చెడు కూడా ఉంటుంది. అయితే కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టబోయే ఈ తరుణంలో వాటిని నేను గుర్తుతెచ్చుకోవాలనుకోవడం లేదు.

■ **కొత్త ఏడాది కోసం మీరు తీసుకున్న కొత్త నిర్ణయాలు ఏంటి?**

నా మనసును ఎక్కువగా ఫాలో అవుతూ వర్క్స్ చేస్తాను. ప్రతి అంశం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించేలా జీవిస్తాను. ఇలా గత ఏడాదిలో ప్రయత్నించి సంతోషంగా జీవనం సాగించాను. ఈ ఏడాది కూడా ఇదే ఫాలో అవ్వాలనుకుంటున్నాను.

■ **2024 మీ జీవితంలో ఎలా ఉండాలనుకుంటున్నారు?**

పెద్దగా అంచనాలు ఏమీ పెట్టుకోవడం లేదు. ఫ్లోను బట్టి ముందుకెళ్తాను. అయితే అన్నీ మంచి, గొప్ప అంశాలే జరగాలని కోరుకుంటున్నాను. సంతోషంగా, హాయిగా, ఆరోగ్యకరంగా గడవాలని ఆశిస్తున్నాను.

■ **కొత్త ఏడాదిని ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?**

కొత్త ఏడాది ఎప్పటిలానే అమ్మానాన్న(జీవిత, రాజశేఖర్), అక్క శివానీలతో హైదరాబాద్‌లోనే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలుస్తాను.

యాక్షన్ ఎంటర్‌టైనర్




● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బీఎస్ఎస్ 10'(వర్కింగ్ టైటిల్). 'ఛీమ్లా నాయక్' మూవీ తర్వాత సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ పూర్తయింది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బీఎస్ఎస్ 10'. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు సాగర్ కె.చంద్ర. ఈ సినిమాలోని కీలకమైన షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ చిత్రంలో కొంతమంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.



● మృణాల్ ఠాకూర్

లారెన్స్‌కు జోడీగా..?



● లారెన్స్

హీరో రాఘవా లారెన్స్, హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని టాక్. ఈ చిత్రంలో లారెన్స్‌కు జోడీగా మృణాళ్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను కూడా అనుకుంటున్నారట మేకర్స్. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

వాస్తవ ఘటనలతో సర్కారు నౌకరి

ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భావన హీరోయిన్‌గా నటించారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో గంగనమోని శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో 90వ దశకం నేపథ్యంలో 'సర్కారు నౌకరి' రూపొందింది. ఇందులోని సందేశం, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''సర్కారు నౌకరి'లో ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ఆకాష్. ''ఈ మూవీతో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు భావన.



● ఆకాష్, భావన

దూడుం దుక్కుడుం బాగుంది

– జీవీ ప్రకాశ్ కుమార్



● శ్రీనాథ్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రణవ్, షాజ్ఞ, భువన్ రెడ్డి

''ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143' చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాట బాగుంది. ఈ సాంగ్‌కి క్లాసికల్ టచ్ ఇవ్వడం బాగా నచ్చింది. ఈ సినిమాలోని ఇతర పాటలు ఎలా ఉంటాయో అని ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం తప్పకుండా మ్యూజికల్ హిట్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్ అన్నారు. ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు– 500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో బ్లాక్ యాంట్ పిక్చర్స్‌పై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాటని జీవీ ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. శ్రీ సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నేపథ్య సంగీతం: కమ్రాన్.